

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



**మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.**

(గత సంచిక తరువాయి)

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లోకి పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'. ఇది మళ్లీ రెండు భాగాలు. అవేమిటో అప్పుడు చూద్దాం. ఈ అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# మొదటి భాగం: పీజీ టు కేజీ

నేను వెళ్లి కాలింగ్బెల్ నొక్కాను. ఒక్క క్షణం అనంతరం తలుపు దగ్గరలో ఏదో గంట మ్రోగింది. కానీ ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు. ఓ క్షణమాగి మళ్లీ బెల్ నొక్కాను. మళ్లీ క్షణమాగి తలుపు దగ్గర్లో గంట మ్రోగింది. కాసేపు ఎదురు చూశాం. ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు.

అలా అక్కడ పావుగంట సేపు గడిపాం. లోపలికెళ్లాల్సిన పద్ధతి ఏమిటో తెలియడంలేదు. కాలింగ్‌బెల్ మ్రోగించినా వెంటనే వచ్చి ఎవరూ తలుపు తీయకపోవడానికి కారణం తెలియడంలేదు. మేము బెల్ మ్రోగించిన క్షణంలో తలుపుదగ్గర గంట ఎందుకు మ్రోగుతోందో తెలియడంలేదు.

మేమక్కడ అలా అయోమయంలో ఉండగా ఒక వ్యక్తి, జర్మన్ కాబోలు, అక్కడికొచ్చాడు. అతన్ని మేము ఏమీ అడగలేదు. అతనూ మమ్మల్ని పట్టించుకోలేదు. అతను తలుపుదగ్గరకొచ్చి కాలింగ్‌బెల్ నొక్కాడు. మరుక్షణంలో తలుపు దగ్గర గంట మ్రోగింది. ఏం జరుగుతుందా అని మేము ఆత్రుతగా చూస్తున్నాం.

గంట మ్రోగగానే అతను తలుపు తోసుకుని లోపలకు వెళ్లాడు. అతని వెనుకనే బ్రతుకు జీవుడా అనుకుంటూ మేమూ లోపలికి వెళ్లాం.

తర్వాత తెలిసింది మాకు. ఎవరైనా కాలింగ్ బెల్ మీట నొక్కగానే అది గ్యోతే ఇన్‌స్టిట్యూట్ ఆఫీసు గదిలో మ్రోగుతుంది. అక్కడ కూర్చున్న సెక్రటరీ తన పక్కనున్న మీట నొక్కుతుంది. అప్పుడు ఈ ప్రవేశద్వారం అన్‌లాక్ అవుతుంది. అందుకు సూచనగా తలుపు దగ్గర గంట మ్రోగుతుంది. వెంటనే తోస్తే తలుపు తెరుచుకుంటుంది. కొద్ది క్షణాల్లో ఆ తలుపుకి దానికదే మళ్లీ తాళం పడిపోతుంది. ఈ ఆటమేటిక్ డోర్ లాకింగ్ అండ్‌ఓపెనింగ్ గురించి మాకు తెలియకపోవడంవల్ల కాస్సేపు బయట ఇబ్బంది పడ్డాం.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ లోపల చాలామంది ఉన్నారు, మాకులాగే! వాళ్లలో మాతో వచ్చిన మలేషియన్సూ ఉన్నారు. మరెందరో వివిధ దేశీయులున్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతీయుల్ని చూశాను. కానీ నోరు విప్పేవరకూ చటుక్కున ఎవరు ఏ ప్రాంతంవారో వెంటనే తెలియదు. కానీ ఇక్కడైతే చైనీస్, జపనీస్, మలేషియన్, ఆఫ్రికన్ వగైరా వివిధ దేశాలకు చెందిన మనుష్యులు చూడగానే విభిన్నంగానూ, తమ దేశాలకు ప్రతినిధుల్లాగానూ అగుపడుతున్నారు.

ఒక్కొక్కరినే ఆఫీసుగదిలోకి పిల్చి ఏదో మాట్లాడి పంపేస్తున్నారు. నాకు పిలుపు రావడానికి సుమారు రెండు గంటలు పట్టింది. చాలా అలసటగా ఉన్నదేమో విసుగ్గా ఉంది అంతసేపు అక్కడ కూర్చోడానికి. ఆ రెండు గంటలల్లోనూ మా జర్మన్ భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించడం జరిగింది. నాకు బొత్తిగా ఏమీ రాదని చెప్పాను కాబట్టి నన్ను పరీక్షించలేదు. ఎంతోకొంత వచ్చునన్నవాళ్లని అప్పటికప్పుడు ప్రత్యేకంగా పరీక్ష చేశారు. దాన్నిబట్టి ఎవరెవర్ని ఏయేక్లాసుల్లో ఉంచాలన్నది నిర్ణయిస్తారన్నమాట!

నన్ను ఆఫీసు గదిలోకి పిలిచేక – నా పేరు, వివరాలు నోట్ చేసుకున్నారు. ఒకామె నన్ను – "ఒక గది ఉంది. చాలా చిన్నది. కానీ ఇంటామె చాలా మంచిది. ఉంటావా?" అనడిగింది ఇంగ్లీషులో.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వరు మాకు వసతి ఏర్పాటు చేయవలసి ఉంది. ఆమె నన్నలా అడిగిందంటే, నాకు కేటాయించిన గది మామూలుగా ఉండే గదులకంటే బాగా చిన్నదయుంటుందని అనుకున్నాను. కానీ జర్మనీ కదా – ఏ ఇల్లయినా తప్పక బాగుంటుందనే ఉద్దేశ్యంతో – "ఉంటాను" అన్నాను మారాలోచన లేకుండా.

"ఇన్‌స్టిట్యూట్‌కి ఆ ఇల్లు కాస్త దూరం. అయితే నువ్వు బస్సు పాసు తీసుకోవచ్చు. ఆ ఖర్చు మా ఇన్‌స్టిట్యూట్ భరిస్తుంది. బస్సులో రావడానికి అభ్యంతరమా?" అందామె మళ్లీ.

అభ్యంతరం చెప్పదగ్గదిగా నాకది తోచలేదు. లేదని చెప్పాను.

"అయితే సరే!" అంటూ ఆమె నాకో కాగితమిచ్చి, మర్నాడుదయమే ఎనిమిది లోపుగా ఇన్‌స్టిట్యూట్‌కి రావలసి ఉంటుందని చెప్పింది. వివరాలన్నీ ఆ కాగితంలో ఇంగ్లీషులో వ్రాసి ఉన్నాయని చెప్పింది.

నాకు కేటాయించిన అడ్రస్ ఓ కాగితంమీద వ్రాసిచ్చి, "ఈ అడ్రసుకి వెళ్లాలి. కావాలంటే టాక్సీ పిలుస్తాను" అందామె.

నాకైతే బస్సులో వెళ్లాలనుంది. కానీ ఊరు కొత్త కదా, అందుకని టాక్సీని పిలవమన్నాను. ఇందాకటి టాక్సీ అనుభవం కూడా నాకు కొంత ధైర్యాన్నిచ్చింది.

ఆఫీసు గదిలోంచి బయటపడి సూట్‌కేసుతో ఇన్‌స్టిట్యూట్ బయటకు వచ్చాను. అప్పటికి నేనూ, మిగతా ఇండియన్ మిత్రులం విడిపోయాం.

నేను బయట నించున్న మరుక్షణంలో టాక్సీ ఒకటి వచ్చి నా ముందు ఆగింది. కాగితం మీది అడ్రస్ టాక్సీ డ్రైవర్‌కి చూపించాను. అతగాడు టాక్సీ దిగి వచ్చి నా సూట్‌కేసు డిక్కీలో పెట్టాడు. నేను టాక్సీ ఎక్కాను.

## భాష రాని వాడను

నేను చేరిన వీధి పేరు హైడ్‌కాంప్ఫ్. ఇంటి నంబర్ పంతొమ్మిది. ఆ ఇంటిముందు టాక్సీ ఆపాడు డ్రైవర్. ఛార్జి అయిదున్నర మార్కులయింది. జర్మనీలో ఖర్చు మొదలైంది అనుకున్నాను.

టాక్సీడ్రైవర్ టాక్సీ దిగి ఇంటావిడను పిలిచాడు. ఆవిడ పేరు యాకేల్. వయసు సుమారు యాభై సంవత్సరాలుండొచ్చు. నన్ను ఆప్యాయంగా చూసింది. చేయి చాపింది. తడబడుతూనే చేయి చాపి షేక్‌హ్యాండ్ ఇచ్చాను. ఆమె ఏదో అంది కానీ అర్థం కాలేదు.

ఆమెను చూడగానే నమస్కరించాలనిపించింది కానీ అదామెకు అర్థం కాదు కదా!

ఆమె కట్టు వేరు, జుట్టు వేరు, పద్ధతి వేరు!

రెండంతస్తుల చిన్న ఇల్లు. కానీ చుట్టూ ఉన్న పెరడు చాలా పెద్దది. ఇంటి చుట్టూ అందమైన తోట ఉంది. ఆమె క్రింది అంతస్తులో ఉంటోంది. నన్ను పై అంతస్తుకి తీసుకు వెళ్లింది. అక్కడ మొత్తం మూడు గదులు, ఒక బాత్రూం ఉన్నాయి. అన్నిటిలోకీ చిన్నగది నాకు కేటాయించబడింది.

టాక్సీడ్రైవర్ నా సూట్‌కేసు లోపలికి తెచ్చిపెట్టాడు. నేను ఒక జర్మన్ దేశీయుడి సేవ అందుకుని అందుకు ప్రతిఫలం ఇస్తున్నానన్న భావన థ్రిల్లింగ్‌గా అనిపించింది.

ఇంటామెకు ఇంగ్లీషు బొత్తిగా రాదు. ఆమె నాకు ఏమేమో చెప్పాలని ప్రయత్నించింది. నాకేమీ తెలియలేదు. ఆఖరికి ఆమె నావద్ద ఉన్న కాగితాలన్నీ తీసుకుని, వాటిలోంచి ఓ రేపర్ బయటకు తీసి ఏదో అడిగింది. నాకు అర్థం కాలేదు. చేత్తో నలుచదరంగా గీసి చూపింది. ఇంకా నాకర్థం కాలేదు. ఏమనుకుందో కిందకు దిగి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిపోయిందనుకుని కాస్త సద్దుకుని కూర్చోబోయాను. అంతలోనే ఆమె మళ్లీ వచ్చింది. ఆమె చేతిలో ఓ ఫొటో ఉంది. అది చూపించి ఏవో సౌంజ్ఞలు చేసింది. నాకర్థమైంది – అలాంటిది నాకుందా అనడిగిందని.

ఇండియాలో నా మిత్రుడు ప్రసాద్ ఇచ్చిన సలహాతో చాలా ఫొటోలు కాపీ తీయించి కూడా తెచ్చుకున్నాను. నా దగ్గర నా ఫొటోల కాపీలు చాలా ఉన్నాయి. త్వరగా సూట్‌కేసు తెరిచి ఓ ఫొటో ఆమెకిచ్చాను.

అప్పుడామె ఇందాకా తను బయటకు తీసిన రేపర్ మడత లోపల ఆ ఫొటోని అంటించి – "బుస్, బుస్, పాస్!" అంది.

బుస్ అంటే ఏమిటో నాకు తెలియలేదు. కానీ ఒక విషయం గుర్తొచ్చింది. ఆ రేపర్ నకు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో ఇచ్చారు. బస్సుపాసులా ఉపయోగించుకోమని చెప్పారు. ఈమె చెప్పేది పాస్ కోసమే అయుండాలనుకున్నాను. బస్సు స్టాపులో ఇలా ఫొటో అంటించాలని ఆమె ఆంతర్యమని ఊహించాను.

ఆమె నాకు రెండు తాళం చెవులిచ్చింది. ఒకటి నా గదికి. ఇంకొకటి వీధితలుపుకి.

ఆమె చెప్పిన మాటలను బట్టి, పక్క గదిలో ఓ ఇండోనీషియన్ ఉంటున్నాడనీ, అతనికి ఇంగ్లీషు వచ్చుననీ అర్థమయింది నాకు.

ఇంగ్లీషు బొత్తిగా రాని ఈమెతో, ఈ ఇంట్లో ఎన్నాళ్లుండగలనా అని మనసులో భయమేసింది.

ఆమె వెళ్లిపోగానే గది తలుపులు మూసి మంచంమీద కూర్చున్నాను.

గది నిజంగానే చిన్నది. ఓ సింగిల్‌కాట్‌ఉంది. తలుపు వైపు గోడనానుకుని ఓ చిన్నచెక్క బీరువా ఉంది. బీరువామీద టేబుల్‌లాంపుంది. మంచంమీద పడుకుని చేయి చాస్తే గది తలుపు తగుల్తుంది నాకు. మంచాన్ని ఆనుకుని అటువైపు ఓ కిటికీ ఉంది. కిటికీలోంచి ఓ ఆటస్థలం కనబడుతోంది. కొందరు పిల్లలు ఫుట్‌బాల్‌ఆడుతూ కనబడ్డారు. టైము అయిదున్నర దాటుతోంది. వెలుతురు చూస్తే శీతాకాలపు మధ్యాహ్నంలా ఉంది.

మంచంమీద పరుపు బాగా మెత్తగా సుఖంగా ఉంది. మేను వాల్చాలనిపిస్తోంది.

ఆట్టే చలి అనిపించడంలేదు. గోడకు హేంగర్లున్నాయి. స్వెటర్ దానికి తగిలించాను. బట్టలు మార్చుకుందామా అనుకుంటూండగా ఎవరో తలుపు తట్టారు.

వెంటనే తలుపు తీశాను. ఎదురుగా యాకేల్, ఆమె పక్కన బాగా పొడవుగా ఉన్న ఓ కుర్రాడు ఉన్నారు.

అతను నా పక్కగదిలో ఉంటున్నాడుట. దేశం ఇండోనీషియా. పేరు వైయాంగ్. ముఖం చూడగానే ఆ ప్రాంతానికి చెందినవాడని ఠక్కున చెప్పేయొచ్చు. వయసు ఇరవై లోపే ఉంటుందనిపించింది.

వైయాంగ్‌ని నావద్ద వదిలిపెట్టి యాకేల్ వెళ్లిపోయింది.

వైయాంగ్‌కి ఇంగ్లీషు బాగా వచ్చని యాకేల్ చెప్పింది కానీ, అతడి ఇంగ్లీషు పరిజ్ఞానం అంతంత మాత్రమేనని తెలుసుకుందుకు నాకు ఎంతో సేపు పట్టలేదు.

హిందీ సినిమాలు చూసి చూసి, రేడియో సిలోన్ విని వినీ, స్కూలుఫైనల్ దాకా ఏదో చదివి, ఒరిస్సాలో మసిలి మసిలి – నేను నేర్చుకున్న హిందీ స్థాయి ఎంతో, అతని ఇంగ్లీషు స్థాయీ అంతే! అయితే ఏం – కొన్ని విషయాలు అర్థం చేసుకోడానికి ఆ పరిజ్ఞానం సరిపోయింది.

అతను నాలుగు రోజుల్నించి ఇక్కడ ఉంటున్నాడుట. తలిదండ్రులు జర్మన్ భాష నేర్చుకోమని అతన్నిక్కడకు స్వంత ఖర్చులమీద పంపించారుట. జర్మనీలో చదువుకుని అక్కడే స్థిరపడిపోవాలని అతని ఆశయమట. ఇంటామె చాలా మంచిదని చెప్పాడు. దగ్గర్లో ఏదో రెస్టారెంట్ ఉన్నదనీ, ఆరున్నరకు తను వచ్చి పిలిచి తీసుకు వెడతాననీ అన్నాడు.

జర్మన్ భాషలో బస్సుని బుస్ అంటారుట. ఇందాకా యాకేల్ ఫొటో అంటించిన రేపర్ని బస్ డ్రయివరుకి చూపిస్తే అతను పాస్ ఇస్తాడుట. పాస్‌కి ఇరవై మార్కుల ఛార్జి అవుతుందనీ, ఆ డబ్బు నెలాఖర్లో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వాళ్లు వాపసు ఇచ్చేస్తారనీ చెప్పాడు. మామూలుగా అయితే బస్సు పాస్ ఇంకా ఖరీదుట. ఇది స్టూడెంట్లకి కన్సెషనల్ రేటు!

''ఓహో! నేను మళ్లీ స్టూడెంటునయ్యాను కదూ'' అనుకున్నాను.

అతను వెళ్లగానే కళ్లు కూరుకుపోతున్నట్లనిపించింది. కాసేపు మేను వాల్చాలనిపించింది.

అలవాటు ప్రకారం లుంగీపంచె కట్టుకుని, చొక్కా లేకుండానే మంచంమీద పడుకున్నాను. మంచంమీదున్న రొజాయి కప్పుకున్నాను. చూడ్డానికి సన్నగా బొంతలా ఉంది కానీ కప్పుకుంటే వెచ్చగా, హాయిగా ఉంది.

## పీజీ టు కేజీ

ఎవరో తలుపుతడుతున్నట్లనిపించి ఉలిక్కిపడి లేచాను.

గదిలో వెలుతురు బాగాఉంది. తెల్లారిపోయిందన్నమాట !

టైము చూసుకుంటే ఆరున్నరవుతోంది. ఒక్క ఉదుటున వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా వైయాంగ్ ఉన్నాడు. "నిన్నరాత్రి ఎంత పిలిచినా పలకలేదు నువ్వు. సరే, బాగా అలసిపోయావేమో, వళ్లు తెలియకుండా నిద్ర పట్టేసిందేమో అనుకున్నాను" అన్నాడు.

ఏమాత్రం ఇంగ్లీషు రాని యాకేల్ మాటల్ని ఎంతోకొంత అర్థం చేసుకోగలగడంవల్ల నా భాషాగ్రహణ శక్తి బాగా పెరిగినట్లుంది. వైయాంగ్ మాటలు నాకు వెంటనే అర్థమైపోయాయి.

అంటే పన్నెండు గంటలు నిద్రపోయానన్నమాట! నా నిద్రకి కారణం అలసటా, లేక ఇక్కడి వాతావరణమా?

ఇండియాలో నాకు అంత సులువుగా నిద్ర పట్టేది కాదు. అలసట మాటటుంచి, శివరాత్రి జాగరణ చేసిన మర్నాడు రాత్రి కూడా మంచంమీద కాసేపు అటూఇటూ దొర్లితే తప్ప నిద్ర పట్టేది కాదు.

"బస్సు ఏడుగంటల అయిదు నిముషాలకి! త్వరగా తెములు" అని వెళ్లిపోయాడతను.

నేను బాత్రూంకి వెళ్లాను. కాలకృత్యాల్లో అక్కడ ఇండియన్సుకి ఇబ్బందికరమైనది టాయ్లెట్ పేపరు వాడకం. నీళ్లు వాడినా బయట చెప్పొద్దని నాకు ముందే హెచ్చరికలు అందాయి. కానీ వాష్బేసిన్లో నీళ్లొస్తాయి. అవి పట్టుకుందుకు చెంబంత గ్లాసుంది. బ్రతుకు జీవుడా అనుకుని పావుగంటలో కాలకృత్యాలు తీర్చుకుని షేవింగ్ చేసుకున్నాను. ఇండియాలో అయితే చలికాలంలో చర్మం పెళుసుబారిపోయి గెడ్డం గీసుకోడానికి ఇబ్బందిగా ఉండేది. ఆ రోజు అలాంటి ఇబ్బంది అనిపించలేదు.

షేవింగైన వెంటనే స్నానం చెయ్యడం అలవాటు నాకు. బాత్రూంలో వేణ్ణీళ్ల సదుపాయం ఉంది కానీ స్నానం చేసే అవకాశం లేదు. ఇబ్బందిగా అనిపించినా స్నానం మానక తప్పలేదు.

ఆరూయాభైకల్లా రెడీ అయ్యాను. వైయాంగ్ గదికి వెళ్లి పలకరిస్తే అతను, "ఇంకా తొందరేంలేదు. సరిగ్గా ఏడుకి బయల్దేరవచ్చు" అని ఓసారి నావంక తేరిపార చూసి, "స్వెటర్ వేసుకో" అన్నాడు.

నేను నా గదికి వెళ్లాను. బయట చలిగా ఉంటుందన్నది అప్పటికే స్వానుభవం. జీవితంలో అంతవరకూ ఒక్కసారి కూడా స్వెటర్ వేసుకోకపోవడం వల్ల, నిన్నంతా చలిని భరించాను తప్పితే స్వెటర్ వేసుకోలేదు. ఏడాదికి పైగా ఇక్కడే ఉండాలి కాబట్టి ఇది అలవాటు చేసుకోక తప్పదు.

జీవితంలో మొట్టమొదటిసారిగా స్వెటర్ వేసుకున్నాను. టైము ఏడు కావస్తుండగా వైయాంగ్ వచ్చి పిలిచాడు. ఇద్దరం బయల్దేరాం.

బస్స్టాప్ ఇంటికి దగ్గర్లోనే ఉంది. సరిగ్గా రెండు నిముషాల నడక. మేము వెళ్లేసరికి బస్సు సిద్ధంగా ఉంది.

బస్సెక్కి డ్రైవరుకి ఫొటో అంటించిన రేపర్ చూపాను. పాస్ అన్నాను – ఇరవై మార్కుల నోటు అందించి.

డ్రైవర్ నాకు బస్సు టిక్కెట్టు లాంటిది ఇచ్చాడు. దాని మీద ఇరవై మార్కులు అని రాసి ఉంది. నా రేపర్ మీద ఏదో స్టాంప్ కూడా కొట్టాడు.

వెళ్లి సీట్లో కూర్చున్నాను. బస్సులో వెచ్చగా ఉంది. స్వెటర్ వేసుకోవడంవల్ల ఉక్కబోస్తోంది కూడా. ఐనా స్వెటర్ విప్పలేదు.

వైయాంగ్ నా పక్కనే కూర్చున్నాడు. బస్సులో రష్ లేదు. సీట్లు మెత్తగా, హాయిగా ఉన్నాయి.

ఖరీదైన భవనంలోని హాల్లో, కార్పెట్టు పరచిన నేలలా ఉంది రోడ్డు. భారీ సినిమా సెట్టింగులా ఉంది ఊరు. నాకు బస్సులో వెడుతున్నట్లు లేదు. థియేటర్లో సుఖంగా కూర్చుని సినిమా చూస్తున్నట్లుంది.

నేనూ, వైయాంగ్– బస్ టెర్మినస్ వద్దనే దిగాం.

ఆ ప్రాంతాన్ని అమ్ శాండే అంటారుట. మేము దిగింది మార్కెట్ సెంటర్. చాలా సందడిగా ఉంది. ఆడ, మగ – అందరూ పరుగులు తీస్తున్నట్లు చలాకీగా నడుస్తున్నారు. ఒకళ్లనొకళ్లు పట్టించుకోవడంలేదు. వైయాంగ్ ముందు నడుస్తుంటే నేను వెనుక నడుస్తున్నాను. అద్దాల షోకేసులతో పెద్దపెద్ద షాపులు దాటుకుంటూ పోతున్నాం. నాకైతే ఆగి చూడాలనుంది. కానీ వైయాంగ్ఆగడంలేదు.

రేపట్నుంచి నాకు నేనే వెళ్లొచ్చులే అనుకున్నాను. కానీ ఎలా వెడుతున్నామో, దారి అంత బాగా గుర్తులేదు.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ మార్కెట్ఏరియాకి దగ్గర్లోనే ఉన్నట్లుంది. సరిగ్గా ఏడు నిముషాల్లో అక్కడికి చేరుకున్నాం. నేరుగా బ్రేక్‌ఫాస్ట్ రూంకి తీసుకెళ్లాడు వైయాంగ్. అక్కడంతా బఫే సిస్టం. ఎవరి తిండి వారు తెచ్చుకోవాలి. బాయిల్డ్ ఎగ్ వగైరాలేవో ఉన్నాయి. కాఫీ, టీ కలుపుకునేందుకు ఏర్పాట్లున్నాయి. అక్కడ నాకు నప్పేవి పావులీటరు పాలప్యాకెట్లు, బ్రెడ్ స్లయిసులు, బుల్లి బుల్లి ప్యాకెట్లలో – వెన్న, జాం, చీజ్. పాలు ఒక్క గుక్కలో తాగాను. ఫ్రిజ్ లోంచి తీసినట్లు చల్లగా ఉన్న పాలు రుచి కూడా తెలియలేదు నాకు. బ్రెడ్డుకి వెన్న, జాం రాసుకుని తినేసరికి కడుపు నిండిపోయింది. చీజ్ నకు సహించలేదు.

బ్రేక్‌ఫాస్ట్ కాగానే వైయాంగ్ న్ను ఆఫీసుకి వెళ్లమని చెప్పాడు.

ఆఫీసులో నాకు నెలఖర్చులకిగానూ మూడువందలమార్కులు ఇచ్చారు. కొత్తగా చేరినవారికి బ్యాగేజీ ఎలవెన్స్ఉంటుందట. అందుకని మరో నూటయాభై మార్కులు ఇచ్చారు. మొత్తం నాలుగు వందల యాభై మార్కులు చేతికి అందాయి. ఆ డబ్బు చేతికందగానే బలంగా, ధైర్యంగా ఫీలయ్యాను.

ఆ డబ్బు కాక పగటిపూట భోజనానికి ఓ ఇరవై మీల్సు టిక్కెట్లు కూడా ఇచ్చారు. ఆ టికెట్లు ఊళ్లోని పదకొండు హోటళ్లలో చెల్లుతాయట. ఆ టికెట్లు ఉపయోగించుకోని పక్షంలో – నెలాఖర్లో తిరిగిచ్చేస్తే – టికెట్టుకి నాలుగున్నర మార్కుల చప్పున వాపసు ఇస్తారుట.

ఆఫీసు దగ్గర ఉండగానే అక్కడికి కొందరు టీచర్లు వచ్చారు. వాళ్లు తమవద్దనున్న జాబితాలు తీసి కొన్ని పేర్లు చదివారు. ష్వయిరింగ్ అనే ఆమె జాబితాలో నాపేరుంది. అనగా ఆమె నాకు టీచరన్నమాట.

నాతో పాటు వచ్చిన మిగతా ఇండియన్లు నటరాజన్, బిశ్వాస్, గుప్తాల పేర్లు కూడా ష్వయిరింగ్ జాబితాలోనే ఉన్నాయి. అందుకు ఎంతో సంతోషిస్తూ, మేము నలుగురం ఆమెతోపాటు క్లాసుకి వెళ్లాం.

క్లాస్‌రూం అమరికగా ఉంది. ప్రతి ఒక్కరికీ అందమైన కుర్చీ, దానిముందు బల్ల ఉన్నాయి. ప్రతి బల్లమీదా హెడ్‌ఫోన్సు ఉన్నాయి. ఎదురుగా టీచరు కూర్చునేందుకు కుర్చీ, బల్ల – ఆమె వెనుక గోడకి వ్రాతబల్ల ఉన్నాయి. బల్లమీద టేపురికార్డర్, స్లైడుప్రొజెక్టర్ఉన్నాయి. కాస్త పక్కగా స్లయిడ్ షోకి అనువైన తెర ఉంది.

మా క్లాసులో మొత్తం పాతికమంది ఉన్నారు. అందులో అరేబియా, ఫ్రెంచ్, ఆఫ్రికా, జపాన్, ఇండియా, బ్రెజిల్, స్పెయిన్, అమెరికానుంచి వచ్చిన వారున్నారు. అమ్మాయిలు నలుగురు. నల్లవాళ్లు అయిదుగురు. ఇండియన్సులో నాతోపాటు వచ్చినవారు కాక లాల్, శర్మ అనే మరో ఇద్దరున్నారు. ముందు అంతా ఒకరినొకరు పలకరించుకుని హడావుడిగా పరిచయం చేసుకున్నాం. అక్కడ అంతమంది

భారతీయుల్ని చూశాక కొంత ఉత్సాహం కలిగింది. లాల్, శర్మల స్కాలరుషిప్పు డాడ్ కాదు. మరేదోనట. వాళ్ళొచ్చి ఒకటి రెండు రోజులయిందిట.

లాల్ నాతో, "ప్రస్తుతం ఇక్కడ చేరినవారిలో సుబ్రహ్మణ్యం అనే తెలుగతనున్నాడు. అతనూ ఇక్కడకు వచ్చి కొద్ది రోజులే అయింది. ఇంకో క్లాసులో ఉన్నాడు. మనం భోజనాలవద్ద కలుసుకోవచ్చు" అన్నాడు.

"క్లాసులెప్పుడు? భోజన విరామమెప్పుడు?" అన్నాను.

"నీకిచ్చిన కాగితం చదవలేదా?" అన్నాడు లాల్.

నేనెక్కడ చదివాను? ఇంటికెళ్లి పడుకుని లేచి ఆదరాబాదరాగా ఇలా చక్కావచ్చాను. ఆ విషయం తెలిసి లాల్ఆ వివరాలు చెప్పాడు.

ల్యూనబర్గులో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ సోమ-శుక్రవారాలు ఉదయం 8-1, మధ్యాహ్నం 3-6 పని చేస్తుంది. ఉత్తరాలకోసమైతే శనివారాలు కూడా ఆఫీసుకొచ్చి 10-10.30 మధ్య తీసుకోవచ్చు. మిగతా రోజుల్లో ఉత్తరాలు తరగతి గదుల్లోకి తెచ్చిస్తారు. క్లాసులు లేనప్పుడు హౌస్ నంబర్ వన్‌లో జర్మన్ భాష సాధన చేసుకోవచ్చు. రూమ్‌నంబర్ 2లో రేడియో, టివి ఉన్నాయి. ఫలహారాల గదిలో పియానో ఉంది. హౌస్‌నంబర్2 లో టేబుల్‌టెన్నిస్ ఆడుకోవచ్చు. అక్కడ ఇంకా టివి గది, శీతలపానీయాల ఆటోమాట్(ఆటోమేటిక్ మెషీన్), రీడింగ్ రూ, రేడియో, టైపురైటర్ ఉన్న వ్రాతగది ఉన్నాయి. ప్రతి రోజూ రాత్రి 6-7 మధ్య సంస్థ మూసేస్తారు.

ఉదయం 7-8 సెల్ఫ్ సర్వీస్ ఫలహారం. 8కి కిచెను మూసేస్తారు. లంచికి వోచర్లిస్తారు. వాళ్లిచ్చిన జాబితాలోని 11 రెస్టారెంట్లలోనూ, ఏదైనా ఎంచుకోవచ్చు. జర్మన్ తిండికే అలవాటు పడడం మంచిదంటారు. వోచర్లు మిగిలిపోతే, ఆఫీసులో ఇచ్చి డబ్బులు వెనక్కి తీసుకోవచ్చు. శనాదివారాలూ, సెలవు దినాల్లో భోజనాల ఖర్చు ఎవరిది వారే భరించాలి. ప్రతి ఇంటా స్నానాల సదుపాయం ఉండదు. ఉంటే అనుమతి తీసుకుని ఉపయోగించుకోవచ్చు. ఇంటివాళ్లు అడిగితే డబ్బిచ్చుకోవాలి. ఇంకా స్వల్పధరలకి ఊళ్లో మునిసిపల్ రిసార్టుల్లోని స్నానశాలల్ని కూడా ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా సాయంత్రాలు, శనివారాల్లో ఉదయం 7నుంచి రాత్రి 7 దాకానూ, ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1దాకా అది తెరచి ఉంటుంది. ఇండోర్ స్విమ్మింగ్ పూల్ కూడా ఉందక్కడ. అక్కడ నీళ్లు వెచ్చగా ఉంటాయి. కెరటాలు పడిలేస్తూ ఉంటాయి.

ఉండడానికే ఇల్లు. వంటకీ, బట్టలుతకడానికీ సదుపాయం లేదు. కరెంటు సాధనాలు వాడితే లాండ్‌లేడీకి చెప్పాలి. ఇంటికి మిత్రులొస్తే వాళ్లు రాత్రి 10లోగా వెళ్లిపోవాలి. ఎక్కువమంది మిత్రులుంటే వాళ్లని ఇళ్లలో కాక ఆఫీసులో కలవడం మంచిది. ఇల్లు ఆఫీసుకి దూరమైతే 30-50 నిముషాల నడక ఉండొచ్చు. దారిలో ఎక్కడైనా దొంగతనం జరిగితే, సంస్థ బాధ్యత లేదు. ఆ విషయమై ఎవరికివారు జాగ్రత్తలు తీసుకోవాలి. జర్మన్ పౌరుల పరిచయం చేసుకోవాలనుకుంటే, 'హౌస్ దర్ యుగెన్డ్'లో బుధవారాలు రాత్రిళ్లు 'ఔస్‌లేండర్ క్రెయిస్ ల్యూనబర్గ్' సమావేశాలకీ, శుక్రవారాలు రాత్రిళ్లు 'యుగెన్డ్ క్లబ్ సమావేశాలకీ వెళ్లొచ్చు.

ఈ వివరాలు చెప్పినందుకు లాల్‌కి థాంక్స్ చెప్పాను.

సరిగ్గా 8కి క్లాసు మొదలయింది. పాఠం చెప్పేటప్పుడు టీచరు ఆంగ్ల పదాలు వాడలేదు. సైగలతో జర్మన్ పదాలకు అర్థం తెలిసేలా చేస్తోందామె.

మనకు రాని భాషను మనకు రాని ఆ భాషలోనే నేర్పే ఈ పద్ధతి నాకు తమాషాగా అనిపించింది. అదీకాక పాతికమంది వయోజనులకు ప్రాథమికస్థాయినుండీ భాష నేర్పాలంటే, చాలా ఓర్పు కావాలి. అది చాలా కష్టమని నాకు అనిపించింది. మా టీచర్ చూపిస్తున్న సహనం మొదటిరోజునే నన్ను అబ్బురపరచింది.

మొదటిరోజు క్లాసులో మాకు చెప్పిన ముఖ్య విశేషాలు కొన్ని ఉన్నాయి. వాటిని మాత్రం మాకు ఆంగ్లంలోనే చెప్పడం జరిగింది. వాటిలో కొన్ని అప్పటికే నాకు లాల్ చెప్పాడు.

క్లాస్ రూంలో జర్మన్ తప్ప మరో భాష మాట్లాడరాదు. ఇంటికి ఎక్కువమంది అతిథులను ఆహ్వానించకూడదు. అతిధులెవరైనా రాత్రి పది దాటేక ఇంట్లో ఉండకూడదు. తాము నైట్ డ్రస్సు వేసుకుని ఉన్నప్పుడు జర్మన్ మహిళల్ని పలుకరించరాదు. అది అమర్యాదకరం. భోజనం చేసేటప్పుడు ఫోర్కు ఎడమచేతితోటీ, స్పూను కుడిచేత్తోటీ ఉపయోగించాలి. స్పూను ద్రవపదార్థాలకేగానీ ఘనపదార్థాలకి (అనగా అన్నం వగైరాలకి) ఉపయోగించకూడదు.

మధ్యాహ్నం భోజనవిరామసమయంలో సుబ్రహ్మణ్యాన్ని కలిశాను. అతను అచ్చమైన తెలుగువాడే కాక నాకులాగే ఫక్తు శాకాహారి. హెన్నీ బెక్కర్ అనే వృద్ధమహిళ నడిపే రెస్టారెంట్లో శాకాహారం మనకి కాస్త అనువని అతను అన్నాడు. నేను అతన్ని అనుసరించాను. మాతోపాటు లాల్, శర్మలు కూడా అక్కడికే బయల్దేరారు.

అంతకు ముందురోజు లాల్, శర్మలు ఒక చైనీస్ రెస్టారెంతుకి వెళ్లారుట. భోజనంతో పాటు మంచినీళ్లు అడగ్గా, "గిన్నెలు కడగడానికి మాత్రమే మేమిక్కడ నీళ్లుపయోగిస్తాం", అని వెటకారంగా జవాబిచ్చాడట అక్కడి సర్వర్. అందుకని వాళ్లింక ఆ రెస్టారెంటుకి వెళ్లదల్చుకోలేదు.

జర్మనీలో మేము ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయమొకటుంది. ఎవరినైనా పేరు పెట్టి పిలిచేముందు – వాళ్లు మగవాళ్లైతే హెర్ (ఇంగ్లీషులో మిస్టర్ లాంటిది) అనీ, ఆడవాళ్లైతే ఫ్రౌ అనీ, పెళ్లికాని యువతులైతే ఫ్రౌలైన్అనీ – పేరు ముందు తగిలించి పిలవాలి. అంటే మా ఇంటి యజమానురాలిని నేను 'ఫ్రౌ యాకేల్' అని పిలవాలి. పొడిగా 'యాకేల్' అనకూడదు. పలకరింపుకి 'గ్యుటెన్ టాగ్' (గుడ్ డే) అనీ, గుడ్‌బై చెప్పడానికి 'ఔఫ్ వీడర్‌జెహెన్' (సీ యు ఎగైన్) అనీ చెప్పాలి.

కొత్త దేశంలో కొత్త మనుషులమధ్య కొత్త సంప్రదాయాలకి అలవాటు పడ్డానికి ఈ సూచనలు ఆరంభంలో మాకు చాలా బాగా ఉపయోగపడ్డాయి.

## ఆకలేసి అన్నమడిగితే

ఫ్రౌ హెన్నీ బెక్కర్ రెస్టారెంట్లో సర్వింగు చేసేవారందరూ టీనేజర్సు. ఎక్కువమంది ఆడపిల్లలు. వాళ్లు హైస్కూళ్లలో, కాలేజీల్లో చదువుకుంటూ – తీరిక సమయంలో ధన సంపాదనకి ఇలాంటి పనులు చేస్తూంటారుట.

పాశ్చాత్య దేశాల్లో డిగ్నిటీ ఆఫ్ లేబర్ గురించి విన్నాను. ఇక్కడ ప్రత్యక్షంగా చూడగానే ముచ్చటేసింది. కానీ చెల్లెలో, అక్కో, కూతురో – ఇలా రెస్టారెంట్లో పనులు చేసి డబ్బు సంపాదిస్తే ఏ మధ్యతరగతి ఇండియన్ మగాడు సహించగలడు?

మార్పు ఎక్కడ మొదలవ్వాలో అర్థమైంది నాకు. కానీ అదెంత దూరంలో ఉందో తలచుకుంటే....

మిసమిసలాడుతున్న ఒక యువతి వచ్చి మెనూ కార్డు నా ముందుంచింది. నేనది చూడకుండా, "నేను శాకాహారిని" అని చెప్పాను.

అయోమయానికి నిర్వచనం అప్పుడా యువతి ముఖంలో కనబడింది నాకు. ఆమె వెంటనే వెళ్లి హోటలు యజమానురాల్ని పిలుచుకు వచ్చింది.

ఫ్రౌ హెన్నీ బెక్కర్ తెల్లగా, పొడుగ్గా, సన్నగా ఉంది. మోకాళ్లు దిగిన లేత గులాబి ఫ్రాకులో ఎంతో హుందాగా ఉంది. ఆమె నాతో, "నీకేంకావాలో చెప్పు. వండించి పెడతాను" అంది ఎంతో మర్యాదగా.

నాకు గుత్తివంకాయ కూరకావాలి. మాగాయి పెరుగుపచ్చడి కావాలి. ఆమె వండించగలదా?

ఆమె మర్యాదగా నన్నడిగినందుకు, నేనూ మర్యాదగానే బదులివ్వాలి. "నేను శాకాహారిని. శాకాహారం ఏమైనా ఫరవాలేదు" అని చెప్పాను.

"అయితే చికెన్ తింటావా?" అనడిగిందామె.

శాకాహారి చికెన్ తినడమేమిటో, అసలు శాకాహారమంటే ఆమె అవగాహన ఏమిటో నాకర్థం కాలేదు.

ఏమనాలో తెలియక తల అడ్డంగా ఊపాను.

"పోనీ చేపలు తింటావా?" అందామె.

నా ఆశ్చర్యం రెట్టింపయింది. చేపల్ని శాకాహారం అనుకుంటోందంటే – అసలు మాంసాహారమంటే ఏమిటి ఆమె ఉద్దేశ్యంలో!

మళ్లీ తల అడ్డంగా ఊపాను.

ఈసారి ఆమె కళ్లలో కాస్త చిరాకు కనబడింది, "పోనీ ఆమ్లెట్ ఇస్తాలే" అంది.

అదీ తిననసేసరికి ఆమెలో ఓర్పు నశించినట్లుంది, "ఏంచేస్తాం? ఉడకబెట్టిన కోడిగుడ్లే గతి నీకు" అంది.

అవీ తినననని చెప్పడానికి నాకు చాలా భయమేసింది. అలాగని అలవాటు లేని పని చెయ్యలేను కదా! భయం భయంగా తల అడ్డంగా ఊపాను.

"మరేం తింటావ్?" అందామె. ఈసారి ఆమె కళ్లలో కోపం లేదు. జాలి ఉంది.

అసహనం కంటే జాలి మెరుగు కదా – కాస్త ధైర్యం తెచ్చుకుని, "అన్నం, పప్పుదినుసులు, కాయగూరలు, పాలు, పళ్లు" అన్నాను.

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు. అప్పుడు సుబ్రహ్మణ్యం వంకచూసి, "అన్నట్లు నువ్వూ ఇంతేకదూ?" అంది.

అంతవరకూ ఆమెకు స్ఫురించినట్లు లేదు – సుబ్రహ్మణ్యంలాంటి వ్యక్తి మరొకడుండొచ్చని!

అతను తలూపగానే చిన్నగా నవ్వుకుంటూ లోపలకు వెళ్లిందామె.

ఓ పావు గంటలో మా ఇద్దరికీ అన్నం, ఉడకబెట్టిన క్యారెట్లు, పచ్చిటమేటా ముక్కలు, పచ్చి ఉల్లిపాయముక్కలు, పుల్లగా ఉండే సలాడ్ ఆకులు, ఉడకబెట్టిన కుక్కగొడుగులు (మష్రూమ్స్) వచ్చాయి.

కుక్కగొడుగుల్ని చూడగానే నాకు వెలపరం వచ్చింది. నిజానికి వాటిలో పోషకపదార్థాలు చాలా ఎక్కువని నాకు తెలుసు. జర్మనులకెంతో ప్రీతికరమైన ఐటమ్ అది. కానీ నాకే కాదు, అక్కడున్న ఇండియన్సు మాంసాహారులకి కూడా కుక్కగొడుగులంటే జుగుప్సాభావం ఉంది.

జీవితంలో అలాంటి భోజనం తిని ఎరుగను. కానీ ఇది ఈ రోజుతో ఆగదు. ఒకటి కాదు, రెండుకాదు – కనీసం నాలుగు నెలలపాటు ఈ ఊళ్లో ఇదే తిండి తినాలి. తలుచుకోగానే భయమేసింది నాకు.

దానికితోడు మిగతా ఇండియన్సు నన్ను మరికాస్త భయపెట్టారు. శర్మయితే మరికాస్త జోరు పెంచి, "కొంచెం కొంచెంగా మాంసాహారం అలవాటు చేసుకో. లేకుంటే ఈ దేశంలో నిష్కారణంగా చచ్చిపోతావు" అన్నాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments